క్లుప్తంగా

మార్కెట్ యార్డులో సెక్రటరీ తనిఖీ



కాటాలను తనిఖీ చేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎంపిక శ్రేణి సెక్రటరీ జయలక్ష్మి మంగళవారం మార్కెట్ యార్డులో తనిఖీలు చేపట్టారు. రైతులకు అందిస్తున్న సబ్సిడీ భోజనంలో అన్నం, పప్పు ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. భోజనం ఎలా ఉంటోందని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఇస్కాన్ సంస్థ తయారు చేస్తున్న భోజనం నాణ్యతపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మార్కెట్ యార్డులో వివిధ వ్యవసాయ ఉత్పత్తుల కాటాలను తనిఖీ చేశారు. వేరుశనగ, వాము, కందులు, శనగల తూకాలను ర్యాండమ్‌గా చెక్ చేశారు. తూకాలు వేసే సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెక్రటరీ వెంట సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో సత్తా



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న సీఈఓ సుప్రియ

కర్నూలు (టౌన్): రెండు రోజుల క్రితం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహించిన తైక్వాండో బెల్ట్ పోటీల్లో రవీంద్ర విద్యార్థులు ప్రతిభ చాటారు. పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులను మంగళవారం వెంకాయపల్లెలోని పడిదెంపాడు వద్ద ఉన్న రవీంద్ర గ్లోబల్ స్కూల్ ప్రాంగణంలో సీఈఓ సుప్రియ, ప్రిన్సిపాల్ ముంతాజ్ అభినందించారు. క్రీడాకారులు జయదీప్ గౌడ్, వసంత్ గౌడ్, దుర్గా సాయి, సుహాస్, వివేక్, రోహిత్ హరినందన్, ఖ్యాతి తదితరులు పతకాలు సాధించారు.

అక్రమ నియామకాలపై చర్యలు తీసుకోవాలి



డీఆర్వో సత్యనారాయణమ్మకు వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): హోళగుంద మండలం కోగిలతోట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అక్రమంగా నియమించిన సబ్ ఆపరేటర్ పోస్టులను రద్దు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీఆర్వో సత్యనారాయణమ్మకు డీవైఎఫ్ఐ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ..నోటిఫికేషన్ లేకుండా అక్రమంగా సబ్ ఆపరేటర్లను నియమించారన్నారు. వెంటనే రద్దు చేసి నోటిఫికేషన్ విడుదల చేసి నిబంధనల మేరకు నియామకాలు జరపాలన్నారు.

21న జాబ్‌మేళా

ఆదోని రూరల్: పట్టణంలోని నాక్ శిక్షణా కేంద్రం ఎంపీయూపీ స్కూల్‌లో ఈనెల 21వ తేదీన రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎల్.ఆనంద్‌రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో హ్యుందాయ్ మోబిస్, నవభారత్ ఫర్టిలైజర్స్, ఎల్ఎల్‌పీ, కేఐఎంఎల్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఎంపికైన వారికి రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం అందుతుందన్నారు. మరిన్ని వివరాలకు 91774 13642 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆశ్చర్యం.. అద్భుతం



వాటర్ లీకేజ్ డిటెక్షన్ ఇన్ పైప్స్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న విద్యార్థులు



సోలార్ పవర్ హైబ్రిడ్ ఈ - బైసైకిల్

కర్నూలు కల్చరల్: జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన విజ్ఞాన మేళా 4.ఓలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నమూనా ప్రాజెక్టులు అత్యాధునిక సాంకేతికతతో అబ్బురపరుస్తున్నాయి. కళాశాల ఏర్పాటై 40 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా రూబీ జూబ్లీ సెలబ్రేషన్స్‌లో భాగంగా ఏర్పాటు చేసిన విజ్ఞాన మేళా రెండో రోజు మంగళవారం కొనసాగింది. కళాశాల విద్యార్థులతో పాటు, ఇతర కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు వివిధ అంశాలకు సంబంధించి 110 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. హ్యూమనాయిడ్ రోబోట్, లేజర్ ఎన్‌గ్రేవింగ్ మెషిన్, వర్చువల్ రియాలిటీ, డ్రోన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిఫెన్స్, డ్రోన్ సిమ్యులేషన్స్, మూన్ రోవర్ అప్లికేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ బేస్డ్ వాయిస్ మాడ్యులేషన్, ఫేస్ అండ్ ఆబ్జెక్ట్ రికగ్నిషన్, స్మార్ట్ టెక్నాలజీ, స్మార్ట్ ఎలక్ట్రిక్ మెటార్స్, ఇంటరాక్టివ్ రోబోటిక్స్, ఆండ్రాయిడ్ బేస్డ్ రోబోటిక్స్ ఎగ్జిబిట్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటివరకు 70 పాఠశాలల విద్యార్థులు విజ్ఞాన మేళాను సందర్శించారన్నారు. మొత్తం 10 వేలకు పైగా సందర్శకులు నమూనాలను వీక్షించారన్నారు. పది వేల సందర్శకుడిగా గుర్తింపు పొందిన బొల్లవరం గ్రామానికి చెందిన శివరామిరెడ్డికి ప్రత్యేక బహుమతిని అందజేశామన్నారు. విజ్ఞాన మేళా బుధవారం మూడో రోజూ కొనసాగుతుందన్నారు.

'నక్షా'తో భూములకు శాశ్వత రక్ష



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగర పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు భూములకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జియో స్పేషియల్ నాలెడ్జ్ టెస్ట్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (ఎన్ఏకేఎస్‌హెచ్ఏ- నక్షా) కార్యక్రమం శాశ్వత రక్షణ కల్పిస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక నూతన కౌన్సిల్ హాలులో సచివాలయ అడ్మిన్, ప్లానింగ్, వీఆర్‌ఓ కార్యదర్శులతో నక్షా పై కార్యక్రమం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి నక్షా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూములకు సంబంధించి అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల సమస్యలు తొలగుతాయన్నారు. కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం భూ రికార్డుల డిజిటలీకరణ కార్యక్రమంలో భాగంగా నక్షా కార్యక్రమాన్ని రూపకల్పన చేసిందన్నారు. వివాద రహిత శాశ్వతమైన ల్యాండ్ రికార్డుల ఏర్పాటుకు నగర ప్రజలు సహకరించాలన్నారు. కర్నూలు నగర పరిధిలో 114 స్క్వేర్ కిలోమీటర్ల భూమిలో పూర్తవుతుందన్నారు. సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ మాట్లాడుతూ ఫరిదా మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 152 పట్టణాల్లో నక్షా కార్యక్రమం ప్రారంభం అవుతుందని, రాష్ట్రంలో ఏడు జిల్లాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ప్రతి ఇళ్లు, ఆస్తిని పక్కాగా సర్వే చేసి అక్షాంశాలు, రేఖాంశాలతో హద్దులను గుర్తించి, విస్తీర్ణాన్ని డిజిటల్ పద్ధతిలో నమోదు చేయనున్నట్లు చెప్పారు. సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, మార్వెల్ జియో స్పేషియల్ డ్రోన్ ఏజెన్సీ వైస్ చైర్మన్ రవికుమార్, ఆర్ జునీద్, సూపరింటెండెంట్ సుబ్బన్న, వెంకటేష్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు భవనం పైన డ్రోన్‌ను పరీక్షించారు.

ట్రైనీ కలెక్టర్ విస్తృత తనిఖీలు



నందనపల్లెలో ఉపాధి కూలీలతో ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గార్గేయపురం సచివాలయాన్ని ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయం పరిధిలో సర్వేలు ఎలా సాగుతున్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించారు. వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే నందనపల్లె పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పథకం చెక్‌డ్యాం పూడిక తీత పనులను తనిఖీ చేశారు. ఆమె వెంట జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, ఎంపీడీఓ రఘునాథ్, ఏపీఓ మధుబాబు, పంచాయతీరాజ్ ఇంజినీర్ ముక్తార్ బాషా తదితరులు ఉన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, మొద్దు నిద్రలో ఉన్న ప్రభుత్వాన్ని నిద్ర లేపాలని ధాళిబజాట కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు కావొస్తున్నా ఇంతవరకు ఏ ఒక్క పథకాన్ని అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పేట్లను గరిటెలతో వాయిస్తూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకరబాబు, నియోజకవర్గాల కో-ఆర్డినేటర్లు ఎం.కాశీంవలి, బి.క్రాంతినాయుడు, యూ.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడ్డ ఉరుకుందు



ఖాదర్ బాషా

కోడుమూరు రూరల్: శివరాత్రి సందర్భంగా శ్రీశైల మల్లికార్జునుడిని దర్శించుకునేందుకు వెళుతున్న ఓ పాదయాత్రికుడిని ద్విచక్రవాహనం ఢీకొంది. మంగళవారం రాత్రి కోడుమూరు-కర్నూలు రహదారిపై పెంచికలపాడు వద్ద జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. ఎమ్మిగనూరు మండలం ఎర్రకోట గ్రామానికి చెందిన ఉరుకుందు తోటి గ్రామస్తులతో కలిసి శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరాడు. అయితే మార్గమధ్యలో పెంచికలపాడు గ్రామం వద్ద బైక్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉరుకుందుతో పాటు, ద్విచక్రవాహనంపై వస్తున్న కటికె ఖాదర్ బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని విశ్వభారతి హాస్పిటల్‌కు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కె.నాగలాపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాహిత్య అవార్డు గ్రహీతకు వీసీ పదవిపై హర్షం

కర్నూలు(అర్బన్): ఆదివాసీ ఎరుకుల కులంలో జన్మించి, ఆదిమ జాతి తెగల్లో లిపి లేక అంతరించి పోతున్న భాషలకు లిపి కనుగొని రాష్ట్రపతి చేతుల మీదుగా కేంద్ర సాహిత్య అవార్డును అందుకున్న తొలి గిరిజన మహిళ ప్రసన్న శ్రీకి ఉపకులపతి పదవి వరించడం హర్షణీయమని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప అన్నారు. ఆదివాసీ తెగలపై, ఆదివాసీ సమాజం, సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలపై ఆమె అనేక పరిశోధనలు చేశారన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో చంద్రప్ప మాట్లాడుతూ.. ఆదివాసీల పట్ల ఆమెకున్న స్పృహ, ఆలోచనను గుర్తించిన ప్రభుత్వం ఆమెను నన్నయ్య విశ్వ విద్యాలయం ఉప కులపతిగా నియమించారన్నారు. అత్యంత వెనుకబాటుకు గురైన ఎరుకలి జాతిలో, ఓ మహిళకు అత్యున్నత పదవి దక్కడం సంతోషించదగ్గ పరిణామమన్నారు. టీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామరాజు, నాయకులు ఉపేంద్ర, దత్తు, రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిమ్మప్పస్వామి రథోత్సవం



మద్దికెర : మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో మంగళవారం అశేష జనవాహిని మధ్య తిమ్మప్ప, దడేధూళప్ప, యడివళ్ళప్పస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, సహస్ర అష్టోత్తర నామం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య, మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి రథంలో కొలువుంచారు. అనంతరం రథం ముందు హోమం నిర్వహించి స్వామి వార్ల రథోత్సవం ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల వారు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

కర్నూలు(సెంట్రల్): ఫిబ్రవరి 20న ఎల్ఐసీ ఉద్యోగుల లంచ్ అవర్ సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం ఎల్ఐసీ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మెకు మద్దతు తెలిపాలని కోరుతూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్ఐసీలో ఖాళీగా ఉన్న 3, 4 తరగతి ఉద్యోగుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు గుర్తింపును పునరుద్ధరించాలని కోరారు. బీమా రంగంలో 100 శాతం పెట్టుబడులను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్ సాయిబాబా, సుధాకరప్ప, బి.రాధాకృష్ణ, మహ్మద్‌రఫీ, ఏసు, మల్లీ, దస్తగిరి పాల్గొన్నారు.

కార్మిక ఉద్యమ నేతకు కన్నీటి వీడ్కోలు



రాజగోపాల్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గఫూర్

కర్నూలు(సెంట్రల్): కార్మిక ఉద్యమ నేత, మాజీ కార్పొరేటర్ రాజగోపాల్‌కు వామపక్ష పార్టీలు కన్నీటి వీడ్కోలు పలికాయి. సోమవారం సాయంత్రం ఆయన అనారోగ్యంతో మృతి చెందడంతో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ ఆనంద్‌బాబు, సీపీఐ నాయకులు రామకృష్ణారెడ్డి, కె.జగన్నాథం నివాళులర్పించారు. కమ్యూనిస్టు ఉద్యమాలకు రాజగోపాల్ మరణం తీరని లోటని, ఆయన ప్రజా నాట్యమండలికి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. అనంతరం ఆయన అంతిమ యాత్ర నిర్వహించి జమ్మిచెట్టు వద్ద ఉన్న శ్మశాన వాటికలో ఖననం చేశారు.

నేడు ఛత్రపతి శివాజీ జయంతి

కర్నూలు కల్చరల్: బాల శివాజీ యూత్ ఆధ్వర్యంలో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు బండి మెట్ట అంబాభవానీ దేవాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్కడి నుంచి స్వామి వివేకానంద సర్కిల్ (రాజ్‌విహార్) వరకు ఛత్రపతి శివాజీ మహారాజ్ ప్రతిమతో శోభాయాత్ర ఉంటుందని పేర్కొన్నారు. హిందూ బంధువులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

బైక్ ర్యాలీ

వీకర్ సెక్షన్ కాలనీలోని పట్టాభి రామ, వీరాంజనేయ స్వామి ఆలయం నుంచి ఉల్చాల రోడ్‌లోని ఛత్రపతి శివాజీ సర్కిల్ వరకు ఉదయం 9.30 గంటలకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హిందువులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

తపాలా శాఖ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం



నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా ఉద్యోగులు

కర్నూలు(అర్బన్): కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తపాలా శాఖను ప్రైవేటీకరణ చేసేందుకు సాగిస్తున్న కుట్రలను అడ్డుకుంటామని ఆ శాఖలోని పలు ఉద్యోగ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా నాలుగు ప్రధాన ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం స్థానిక తపాలా శాఖ ప్రధాన కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎన్ఎఫ్‌పీఈ పీ-4 రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎం.మహ్మద్‌జానీ, పీ-4 రాష్ట్ర సహాయ కార్యదర్శి కే.ఈశ్వరయ్య, పీ-3 జిల్లా కార్యదర్శి జి.గిరిబాబు, పీ-4 జిల్లా కార్యదర్శి ఏ.శమంతకరెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దిగిరాకపోతే దేశవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. నాయకులు లక్ష్మీకాంత్, శివకుమార్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు అర్హులందరికీ స్థలం ఇచ్చి ఇళ్లు కట్టిస్తానని మాట ఇచ్చారని, ఇప్పుడు షరతులు పెట్టి ఇళ్ల స్థలాలను పొందడానికి వీల్లేకుండా చేయడం భావ్యం కాదని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.రామచంద్రయ్య అన్నారు. మంగళవారం సీఆర్ భవన్‌లో నగర కార్యదర్శి రామకృష్ణ అధ్యక్షతన ఇళ్ల స్థలాలపై సదస్సు నిర్వహించారు. ఆయనతోపాటు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. ఐదెకరాలకు మించి పొలం ఉండరాదని, ఇంట్లో ఉద్యోగులు ఉండరాదని, కుటుంబ ఆదాయం రూ.1.20 లక్షలు దాటకూడదని పలు షరతులు పెడుతుండడంతో ఒక్కరికీ కూడా ఇంటి స్థలం మంజూరయ్యే అవకాశం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇచ్చిన మాట ప్రకారం పేదలకు నివాసయోగ్యమైన ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు సాయం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచినా సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. నాయకులు జగన్నాథం, ఎస్.మునెప్ప, శ్రావణిరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీఆర్ డీఈ

కల్లూరు: సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పంచాయతీ రాజ్ డీఈ నాగిరెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం కె.మార్కాపురం గ్రామంలో జరుగుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. రోడ్ల పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఆయనతో పాటు ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, పీఆర్ ఏఈ రవి మోహన్‌రెడ్డి ఉన్నారు.

శాశ్వత ఆర్థికాభివృద్ధికి సహకారం అందించండి

- మాల కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నేతలు



మాల కార్పొరేషన్ చైర్మన్‌ను సన్మానిస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): షెడ్యూల్డు కులాల సేవా ఆర్థిక సహకార సంస్థ ఆధ్వర్యంలో దళితులకు శాశ్వత ఆర్థిక ప్రయోజనాలు కలిగే పథకాలు అమలు చేయాలని మాల సంఘాల నేతలు కోరారు. కర్నూలుకు వచ్చిన ఏపీ మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ మంగళవారం స్థానిక ఎస్వీ రీజెన్సీలో మాల కుల సంఘాల నేతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ఆయా సంఘాల నాయకులు గోన నాగరాజు, సి. అశోకరత్నం, వాడాల త్యాగరాజు, కాసారపు వెంకటేష్ చిటికెల సలోమి, శామ్యూల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇప్పటి వరకు చిన్న చితకా రుణాలను మాత్రమే అందిస్తున్నారని, దీని వల్ల దళితుల ఆర్థికాభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే సామెతగానే ఉందన్నారు. పేదరికంలో మగ్గుతున్న దళితులకు చిన్న చిన్న రుణాలు కొంత ఉపశమనాన్ని కలిగించినా, శాశ్వతంగా వారు పేదరికానికి దూరం కాలేకపోతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే ఎంతో మంది ఉన్నత విద్యను అభ్యసించిన దళిత నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకొని పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు సబ్సిడీ రుణాలు అందించాలని కోరారు. అలాగే బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ, ఈబీసీ తదితర వర్గాలకు రుణాలను అందించే ప్రక్రియ ప్రారంభమైందని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కూడా ఈ ప్రక్రియ ప్రారంభం అయ్యేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు చైర్మన్ విజయకుమార్, డైరెక్టర్ పోతురాజు రవికుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల జ్యోతి, రాజీవ్‌కుమార్, లక్ష్మయ్య, బి.సుబ్బరాయుడు, మహేష్, మాధవస్వామి, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ సేవలు మెరుగుపడాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో నర్సింగ్ సేవలు మరింత మెరుగుపడాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో హెడ్ నర్సులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు నర్సింగ్ సేవలు కీలకమన్నారు. పలు విభాగాల్లో ఉండే వైద్య పరికరాలు, బాత్‌రూమ్‌లు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలను బయటకు రాయవద్దని, రోగుల నుంచి ఎంఎన్ఓలు, ఎఫ్ఎన్ఓలు, పారిశుధ్య కార్మికులు డబ్బులు అడిగితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే నర్సులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలో పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని స్పష్టం చేశారు. సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రి బాయి తదితరులు పాల్గొన్నారు.

మైక్రో ఫైనాన్స్ వేధింపులు ఆపాలి

పత్తికొండ రూరల్ : గ్రామాల్లోని రైతులు, చిరువ్యాపారులపై మైక్రో ఫైనాన్స్ వేధింపులను ఆపాలని కోరుతూ సీపీఎం నాయకులు కోరారు. వివిధ ఫైనాన్స్ కంపెనీల బాధితులు రామాంజినేయులు, ముక్కెళ్ల గోవర్ధన్‌రాజు, దూదేకొండ పులికొండ తదితరులతో కలిసి పత్తికొండలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ దళారులతో గ్రామాల్లో గృహ రుణసదుపాయాల పేరుతో ప్రచారం చేయించి, రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని వారికి అప్పులు ఇచ్చారన్నారు. పూర్తిగా కరువు కాటకాలతో అల్లాడిపోతున్న రైతులు అప్పులు తీర్చలేని పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంతు కట్టడం ఆలస్యమైతే మైక్రోఫైనాన్స్ ఉద్యోగులు వేధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగారెడి, వెంకటేశ్వర్లు, దస్తగిరి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు విశేష పూజలు



దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



ప్రత్యేక అలంకారణలో అమ్మవారు

కర్నూలు(రూరల్): నగర సమీపంలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. కుంకుమార్చన, ఆకుపూజ చేశారు మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి గుగ్గిళ్లు, భక్షాలు నైవేద్యంగా సమర్పించారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.